నేటి మ్యాచ్
భారత్ X ఆస్ట్రేలియా
మ. 2.00 నుంచి
వేదిక: చెన్నై

పతక వందనం

ఆసియాగేమ్స్‌లో భారత్ కొత్త చరిత్ర • 107 పతకాలతో నాలుగో స్థానంలో

- కబడ్డీలో పసిడి పతక జోరు
- సాత్విక్, చిరాగ్ స్వర్ణ సంబురం
- జ్యోతి సురేఖ సూపర్ గురి
- మహిళల హాకీలో భారత్‌కు కాంస్యం

హాంగ్జౌ: కాంటినెంటల్ టోర్నీ ఆసియా గేమ్స్‌లో భారత్ కొత్త చరిత్రకు నాంది పలికింది. గత రికార్డులను తిరుగరాస్తూ నయా శకానికి బాటలు వేసింది. స్పోర్ట్స్ పవర్‌హౌజ్‌లుగా వెలుగొందుతున్న చైనా, కొరియా, జపాన్‌కు దీటైన సవాల్ విసురుతూ ఆసియాడ్‌లో భారత్ దిగ్విజయంగా పతకాల వేట కొనసాగించింది. కరోనా వైరస్ విజృంభణ కారణంగా ఏడాది ఆలస్యంగా జరిగిన మెగా టోర్నీలో భారత ప్లేయర్లు ఆకాశమే హద్దుగా చెలరేగారు. పదిహేను రోజుల పాటు అభిమానులను అలరించిన టోర్నీలో పోటీలకు ఆఖరి రోజైన శనివారం భారత్ 6 స్వర్ణాలు సహా నాలుగు రజతాలు, 2 కాంస్యాలతో 12 పతకాలు కొల్లగొట్టింది. 'ఇస్ బార్ సౌ పార్' నినాదాన్ని బాగా ఒంటపట్టించుకున్న మనోళ్లు జాతీయ పతాకాన్ని సగర్వంగా రెపరెపలాడించారు. వచ్చే ఏడాది జరిగే పారిస్(2024) ఒలింపిక్స్‌కు ముందు మెండైన ఆత్మవిశ్వాసం సొంతం చేసుకున్నారు. హాంగ్జౌ ఆసియాడ్‌లో అథ్లెట్లు 29 పతకాలతో అగ్రస్థానంలో నిలిస్తే..22 పతకాలతో షూటర్లు తమ గురికి తిరుగులేదని చాటి చెప్పారు. మొత్తంగా 107 పతకాలతో భారత్ నాలుగో స్థానంలో నిలిచింది.

భారత క్రీడా చరిత్రలో సువర్ణాధ్యాయం. ప్రతిష్ఠాత్మక ఆసియాగేమ్స్‌లో మన ప్లేయర్లు పతక వందనం చేశారు. 'ఇస్ బార్ సౌ పార్' అన్న నినాదాన్ని చేతల్లో చూపిస్తూ పతకాల పంట పండించారు. పతక వేటలో ఆఖరి రోజైన శనివార భారత ప్లేయర్లు డజను పతకాలతో దుమ్మురేపారు. పురుషుల, మహిళల కబడ్డీలో పసిడి పతక జోరు దిగ్విజయంగా కొనసాగిస్తే..బ్యాడ్మింటన్‌లో సాత్విక్, చిరాగ్ జోడీ పసిడి వెలుగులు విరజిమ్మింది.

ఆర్చరీలో తెలుగమ్మాయి జ్యోతిసురేఖ స్వర్ణ గురితో కదంతొక్కితే ఓజాస్, అభిషేక్, అదితి ప్రతిభ చాటారు. చెస్‌లో వెండితో ధగధగ మెరిస్తే..క్రికెట్‌లో మరో పసిడి మన ఖాతాలో చేరింది. మొత్తంగా 28 స్వర్ణాలు సహా 38 రజతాలు, 41 కాంస్యాలతో 107 పతకాలతో భారత్ నాలుగో స్థానంలో నిలిచింది. సుదీర్ఘ ఆసియాగేమ్స్ చరిత్రలో భారత్‌కు ఇదే అత్యుత్తమ ప్రదర్శన.

రెండు రజతాలు మనవే

చదరంగంలో భారత పురుషుల, మహిళల గ్రాండ్‌మాస్టర్ల బృందం రజత పతకం చేజిక్కించుకుంది. వరల్డ్ నంబర్ 1 ప్రజ్ఞానంద, గుకేశ్, విదిత్ గుజరాతీ, పెండ్యాల హరికృష్ణ, అర్జున్ ఎరిగైసీలతో కూడిన పురుషుల జట్టు 9, 10వ రౌండ్‌లో ఫిలీప్పీన్స్‌ను 3.5-0.5తో చిత్తు చేసింది. మహిళల విభాగంలో గ్రాండ్‌మాస్టర్ కోనేరు హంపి, ద్రోణవల్లి హారిక, వైశాలి, వంతిక అగర్వాల్, సవితా శ్రీలతో కూడిన బృందం దక్షిణ కొరియాపై 4-0తో గెలుపొందింది.

దీపక్ పూనియాకు రజతం

రెజ్లింగ్‌లో ఆఖరి రోజు కచ్చితంగా స్వర్ణం గెలుస్తాడనుకున్న దీపక్ పూనియా నిరాశపరిచాడు. 24 ఏళ్ల సంచలనం దీపక్ 86 కిలోల విభాగంలో రజతంతో సరిపెట్టుకున్నాడు. టైటిల్ ఫేవరెట్‌గా బరిలోకి దిగిన భారత మహిళల హాకీ జట్టు కాంస్యంతో సరిపెట్టుకుంది.

జ్యోతి

సాత్విక్ చిరాగ్

ఆర్చరీలో పతక జోరు:

ఈసారి ఆసియాడ్‌లో భారత్ ఆర్చర్లు తమ అద్భుత గురితో పతకాలు కొల్లగొట్టారు. మహిళల కాంపౌండ్ వ్యక్తిగత ఫైనల్లో జ్యోతి సురేఖ 149-145తో సో చీవాన్(కొరియా)పై అద్భుత విజయం సాధించింది. ఈ టోర్నీలో జ్యోతికి ఇది మూడో స్వర్ణం. మరోవైపు అదితి గోపీచంద్ కాంస్యాన్ని ముద్దాడింది. పురుషుల కాంపౌండ్ వ్యక్తిగత ఫైనల్లో భారత ఆర్చర్లు ఓజాస్ ప్రవీణ్ పసిడి దక్కించుకోగా, అభిషేక్ వర్మ రజతం ఖాతాలో వేసుకున్నాడు.

అబ్బాయిలూ సాధించారు

శనివారం అఫ్గానిస్థాన్‌లో జరిగిన ఫైనల్ మ్యాచ్ వర్షం కారణంగా రద్దవ్వడంతో మెరుగైన ర్యాంక్ ఉన్న టీమ్‌ఇండియాను అంపైర్లు విజేతగా ప్రకటించారు. దాంతో రుతురాజ్ గైక్వాడ్ సేన స్వర్ణం పతకంతో సంబురాలు చేసుకుంది.

సాత్విక్, చిరాగ్ నయా చరిత్ర

ఆసియాడ్ బ్యాడ్మింటన్‌లో స్వర్ణ పతకం గెలిచిన తొలి భారత జోడీగా సాత్విక్‌సాయిరాజ్, చిరాగ్‌శెట్టి నిలిచింది. శనివారం జరిగిన పురుషుల డబుల్స్ ఫైనల్లో సాత్విక్, చిరాగ్ ద్వయం 21-18, 21-16తో కొరియా జంట చోయి సుయి, కిమ్ వున్‌పై అద్భుత విజయం సాధించింది. సరిగ్గా 41 ఏండ్ల క్రితం 1982లో లీయోరీ డిసౌజ, ప్రదీప్ గందె జోడీ కాంస్యం గెలిచింది. ఈసారి డబుల్స్‌లో స్వర్ణం, పురుషుల టీమ్‌ఈవెంట్‌లో రజతం, సింగిల్స్‌లో కాంస్యం గెలువడం భారత్ అత్యుత్తమ ప్రదర్శనగా నమోదైంది.

కబడ్డీలో పసిడి ధమాకా

పురుషుల కబడ్డీ ఫైనల్లో భారత్ 33-29 తేడాతో డిఫెండింగ్ చాంపియన్ ఇరాన్‌ను మట్టికరిపించింది. దీంతో మెగాటోర్నీలో రికార్డు స్థాయిలో ఎనిమిదో సారి పసిడి పతకాన్ని గర్వంగా ముద్దాడింది. హోరాహోరీగా సాగిన పోరులో రిఫరీ నిర్ణయం విషయంలో ఇరు జట్ల ప్లేయర్ల మధ్య తీవ్ర వాదోపవాదాలు జరిగాయి. మరోవైపు నువ్వానేనా అన్నట్లు సాగిన మహిళల పోరులో భారత్ 26-25తో చైనీస్ తైపీ గెలిచిపై మూడోసారి పసిడి దక్కించుకుంది. రైడర్ పుష్ప భారత విజయంలో కీలకంగా వ్యవహరించింది.

పతకాల పట్టిక

	దే	స్వ	ర	కా	మొ
1	చైనా	200	111	71	382
2	జపాన్	51	66	69	186
3	కొరియా	42	59	89	190
4	భారత్	28	38	41	107
5	ఉజ్బెకిస్థాన్	22	18	31	71

నోట్: దే-దేశం, స్వ-స్వర్ణం, ర-రజతం, కా-కాంస్యం, మొ-మొత్తం

43 క్రీడలతో నేషనల్ గేమ్స్

- 28వేదికల్లో పోటీలు

పనాజీ: ప్రతిష్ఠాత్మక నేషనల్ గేమ్స్‌కు రంగం సిద్ధమైంది. గోవా వేదికగా 37వ జాతీయ క్రీడలకు ఈ నెల 26న తెరలేవనుంది. 15 రోజుల పాటు 28 వేదికల్లో మొత్తం 43 క్రీడా విభాగాల్లో పోటీలు జరుగనున్నాయి. ఇందుకు సంబంధించిన వివరాలను గోవా సీఎం ప్రమోద్ సావంత్ శుక్రవారం మీడియా సమావేశంలో వివరించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈసారి నేషనల్ గేమ్స్‌లో ఒలింపిక్స్ క్రీడలతో పాటు సంప్రదాయక ఆటలకు తొలిసారి చోటు కల్పించారు. ఈ సందర్భంగా సావంత్ మాట్లాడుతూ.....గోవాలో స్పోర్టింగ్ ఇకో సిస్టమ్‌ను ఏర్పాటు చేసే లక్ష్యంగా ముందుకెళుతున్నాం.అందమైన బీచ్‌ల ద్వారా ప్రపంచ వ్యాప్తంగా పర్యాటకులను ఆకర్షిస్తున్న గోవా..క్రీడా ఔత్సాహికులను ఆకర్షించేందుకు ప్రయత్నిస్తున్నది' అని అన్నారు.

కార్తీక్ జోడీకి టైటిల్

హైదరాబాద్, ఆట ప్రతినిధి: ఢిల్లీ వేదికగా జరిగిన ఫెనెస్టా జాతీయ టెన్నిస్ చాంపియన్‌షిప్‌లో రాష్ట్ర యువ ప్లేయర్ సాయికార్తీక్ రెడ్డి సత్తాచాటాడు. శనివారం జరిగిన పురుషుల డబుల్స్‌లో కార్తీక్ రెడ్డి, మనీశ్ సురేశ్‌కుమార్ జోడీ 6-4, 6-3తో నితిన్‌కుమార్ సిన్హా, ఇషాక్ ఇక్బాల్ ద్వయంపై అద్భుత విజయం సాధించింది.

మిరాజ్ మెరుపులు

అఫ్గాన్‌పై బంగ్లా ఘనవిజయం


మిరాజ్ (57; 3/25)

ధర్మశాల: ఆల్‌రౌండర్ మెహదీ హసన్ మిరాజ్ (57; 3/25) అటు బ్యాట్‌తో ఇటు బాల్‌తో దుమ్మురేపడంతో.. వరల్డ్‌కప్‌లో బంగ్లాదేశ్ శుభారంభం చేసింది. శనివారం జరిగిన డబుల్ హెడర్ తొలి మ్యాచ్‌లో బంగ్లాదేశ్ 6 వికెట్ల తేడాతో అఫ్గానిస్థాన్‌ను మట్టికరిపించింది. మొదట బ్యాటింగ్ చేసిన అఫ్గాన్ 37.2 ఓవర్లలో 156 పరుగులకు ఆలౌటైంది. ఓపెనర్ రహ్మానుల్లా గుర్బాజ్ (47) ఒక్కడే కాస్త పోరాడగా.. మహమ్మద్ నబి (6), రషీద్ ఖాన్ (9), కెప్టెన్ హష్మతుల్లా (18) విఫలమయ్యారు. బంగ్లా బౌలర్లలో మెహదీ హసన్ మిరాజ్, కెప్టెన్ షకీబ్ అల్ హసన్ చెరో మూడు వికెట్లు పడగొట్టారు. అనంతరం లక్ష్యఛేదనలో బంగ్లాదేశ్ 34.4 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 158 పరుగులు చేసింది. నజ్ముల్ హసన్ షాంటో (59 నాటౌట్), మెహదీ హసన్ (57) హాఫ్ సెంచరీలతో రాణించారు. అఫ్గాన్ బౌలర్లలో ఫజల్‌హక్, నవీన్, అజ్మతుల్లా తలా ఒక వికెట్ పడగొట్టారు. మిరాజ్‌కు 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్'అవార్డు దక్కింది.

సఫారీ సునామీ

మార్క్‌రమ్ ఫాస్టెస్ట్ సెంచరీ

ప్రపంచకప్‌లో అత్యధిక స్కోరు • డికాక్, డసెన్ శతకాలు

- పోరాడి ఓడిన శ్రీలంక
- కుషాల్, అసలంక మెరుపులు

వామ్మో.. అదేం కొట్టుడు రా బాబు! ఒకరి తర్వాత ఒకరు వంతులు వేసుకున్నట్లు.. వాటాలు పంచుకున్నట్లు.. వచ్చినవాళ్లు వచ్చినట్లు విధ్వంసకాండ రచించడంతో.. వన్డే ప్రపంచకప్ చరిత్రలో దక్షిణాఫ్రికా రికార్డు స్కోరు చేసింది. డికాక్, డసెన్ సెంచరీలతో జట్టుకు మంచి పునాది వేస్తే.. మార్క్‌రమ్ ఆకాశమే హద్దుగా చెలరేగి మెగాటోర్నీలో ఫాస్టెస్ట్ సెంచరీ తన పేరిట లిఖించుకున్నాడు. ఈ ముగ్గురి దంచుడుకు దక్షిణాఫ్రికా కొండంత స్కోరు చేయగా.. ఛేదనలో కుషాల్ మెండిస్, చరిత అసలంక, డసున్ షనక అదరక బెదరక ఎదురు నిలిచే ప్రయత్నం చేయడంతో.. లంక పోరాడి పరువు నిలబెట్టుకుంది!

మార్క్‌రమ్ (106)

న్యూఢిల్లీ: ప్రతిష్ఠాత్మక వన్డే వరల్డ్‌కప్ చరిత్రలో అత్యధిక పరుగులు చేసిన జట్టుగా దక్షిణాఫ్రికా చరిత్రకెక్కింది. బాదుడే పరమావధిగా బరిలోకి దిగిన సఫారీ ఆటగాళ్లు విశ్వరూపం కనబర్చడంతో శనివారం డబుల్ హెడర్‌లో భాగంగా జరిగిన రెండో మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా 102 పరుగుల తేడాతో శ్రీలంకపై జయభేరి మోగించింది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన దక్షిణాఫ్రికా నిర్ణీత 50 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 428 పరుగులు చేసింది. 1975 నుంచి ప్రారంభమైన మెగా టోర్నీ చరిత్రలో ఒక జట్టు చేసిన అత్యధిక స్కోరు ఇదే కావడం విశేషం. ఓపెనర్ క్వింటన్ డికాక్ (84 బంతుల్లో 100; 12 ఫోర్లు, 3 సిక్సర్లు), డసెన్ (110 బంతుల్లో 108; 13 ఫోర్లు, 2 సిక్సర్లు), మార్క్‌రమ్ (54 బంతుల్లో 106; 14 ఫోర్లు, 3 సిక్సర్లు) సెంచరీలతో లంకేయులను చీల్చిచెండాడారు. ఆఖర్లో క్లాసెన్ (32; ఒక ఫోర్, 3 సిక్సర్లు), మిల్లర్ (39 నాటౌట్; 3 ఫోర్లు, 2 సిక్సర్లు) కూడా విజృంభించడంతో సఫారీ జట్టు రికార్డు స్కోరు చేయగలిగింది. లంక బౌలర్లలో మధుషనక రెండు వికెట్లు పడగొట్టాడు. అనంతరం లక్ష్యఛేదనలో లంక 44.5 ఓవర్లలో 326 పరుగులకు ఆలౌటైంది. అసలంక (64 బంతుల్లో 79; 8 ఫోర్లు, 4 సిక్సర్లు), కుషాల్ మెండిస్ (42 బంతుల్లో 76; 4 ఫోర్లు, 8 సిక్సర్లు), కెప్టెన్ డసున్ షనక (62 బంతుల్లో 68; 6 ఫోర్లు, 3 సిక్సర్లు) పోరాడినా ఫలితం లేకపోయింది. సఫారీ బౌలర్లలో గెరాల్డ్ మూడు, జాన్‌సెన్, కేశవ్ మహారాజ్, కగిసో రబాడ తలా 2 వికెట్లు పడగొట్టారు.

1 ప్రపంచకప్ చరిత్రలో ఇదే అత్యధిక (428/5) స్కోరు. 2015లో ఆస్ట్రేలియా చేసిన 417 పరుగుల స్కోరు (అఫ్గానిస్థాన్‌పై) రెండోస్థానానికి చేరింది. 413 పరుగులతో (బెర్ముడాపై; 2007లో) భారత్ మూడో స్థానంలో ఉంది.

వరల్డ్‌కప్‌లో అత్యంత వేగవంతమైన (49 బంతుల్లో) సెంచరీ చేసిన ప్లేయర్‌గా మార్క్‌రమ్ చరిత్రకెక్కాడు. కెవిన్ ఓబ్రయాన్ (50 బంతుల్లో ఇంగ్లండ్‌పై; 2011లో) రెండో స్థానంలో ఉన్నాడు.

మెగాటోర్నీలో ఒకే మ్యాచ్‌లో ఒకే జట్టుకు చెందిన ముగ్గురు ప్లేయర్లు సెంచరీలు చేయడం ఇదే తొలిసారి.

4 వన్డే క్రికెట్ చరిత్రలో దక్షిణాఫ్రికాకు ఇది (428/5) నాలుగో అత్యధిక స్కోరు. 439/2 (వెస్టిండీస్‌పై 2015లో), 438/9 (ఆస్ట్రేలియాపై 2006లో), 438/4 (భారత్‌పై 2015లో) తొలి మూడు స్థానాల్లో ఉన్నాయి.

డికాక్ (100)
డసెన్ (108)

వరల్డ్‌కప్‌లో అత్యధిక స్కోర్లు

- **428/5** శ్రీలంకపై దక్షిణాఫ్రికా 2023 ఢిల్లీలో
- **417/6** అఫ్గానిస్థాన్‌పై ఆస్ట్రేలియా 2015 పెర్త్‌లో
- **413/5** బెర్ముడాపై భారత్ 2007 పోర్ట్ ఆఫ్ స్పెయిన్‌లో
- **411/4** ఐర్లాండ్‌పై దక్షిణాఫ్రికా 2015 కాన్‌బెర్రాలో
- **408/5** వెస్టిండీస్‌పై దక్షిణాఫ్రికా 2015 సిడ్నీలో

సంక్షిప్త స్కోర్లు

దక్షిణాఫ్రికా: 428/5 (డసెన్ 108, మార్క్‌రమ్ 106; మధుషనక 2/86), శ్రీలంక: 44.5 ఓవర్లలో 326 ఆలౌట్ (అసలంక 79, కుషాల్ మెండిస్ 76; రబాడ గెరాల్డ్ 3/68, రబడ 2/50)

పైసా వసూల్!

వరల్డ్‌కప్‌ను ఆస్వాదించేందుకు మైదానానికి విచ్చేసిన ప్రేక్షకులకు ఈ మ్యాచ్ చక్కటి వినోదాన్ని పంచింది. మెగాటోర్నీలో ఇప్పటి వరకు జరిగిన మూడు మ్యాచ్‌లకు అభిమానులు పెద్ద సంఖ్యలో రాకపోవడంతో.. నిర్వాహకులు కాస్త ఆందోళన చెందినా.. దక్షిణాఫ్రికా, శ్రీలంక మ్యాచ్ ఆ అనుమానాలను పటాపంచలు చేసింది. ఇరు జట్లు కలిసి 754 పరుగులు చేసిన ఈ పోరులో మొత్తంగా.. 74 ఫోర్లు, 31 సిక్సర్లు నమోదయ్యాయి. మొదట దక్షిణాఫ్రికా జట్టు 45 ఫోర్లు, 14 సిక్సర్లతో 264 పరుగులు రాబడితే.. ఆ తర్వాత లంక 29 ఫోర్లు, 17 సిక్సర్లతో 218 రన్స్ పిండుకుంది.

తస్మాత్ జాగ్రత్త!

ఐసీసీ మెగాటోర్నీల్లో దురదృష్టాన్ని వెంట పెట్టుకొని తిరిగే జట్టుగా ముద్రపడ్డ దక్షిణాఫ్రికా ఈ సారి మాత్రం తాము ట్రోఫీ పట్టేందుకే వచ్చామని తొలి మ్యాచ్‌తోనే చాటింది. భయం అన్నదే ఎరగనట్లు.. అసలు అలుపు అనే పదమే తమ నిఘంటువులో లేనట్లు.. బంతిపై ఏదో ఆజన్మ శత్రుత్వం ఉన్నట్లు.. లంకేయులపై సఫారీలు నిర్దాక్షిణ్యంగా విరుచుకుపడ్డారు.

3 వరల్డ్‌కప్‌లో 400 పైచిలుకు పరుగులు చేయడం దక్షిణాఫ్రికాకు ఇది మూడోసారి. 2015లో ఐర్లాండ్ (411/4)పై, వెస్టిండీస్ (408/5)పై సఫారీలు ఈ మార్క్ దాటారు. ఓవరాల్‌గా వన్డే క్రికెట్‌లో ఆ జట్టు నాలుగొందల పరుగులు చేయడం ఇది ఎనిమిదో సారి.

1 శ్రీలంకపై ఓ జట్టు చేసిన అత్యధిక స్కోరు (428/5) కూడా ఇదే. 2009లో రాజ్‌కోట్ వేదికగా జరిగిన వన్డేలో భారత జట్టు లంకపై 414/7 చేసిన స్కోరు రెండో స్థానానికి చేరింది.

వన్డేల్లో దక్షిణాఫ్రికా అత్యధిక పరుగుల జాబితా

- **439/2** వెస్టిండీస్‌పై 2015లో
- **438/9** ఆస్ట్రేలియాపై 2006లో
- **438/4** భారత్‌పై 2015లో
- **428/5** శ్రీలంకపై 2023లో

విజయోభవ!

ప్రపంచకప్‌లో భారత్ తొలిపోరు
నేడు ఆస్ట్రేలియా, టీమిండియా ఢీ
మధ్యాహ్నం 2 నుంచి..

క్రీడాభిమానులంతా ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న సమయం ఆసన్నమైంది. వన్డే ప్రపంచకప్‌లో మెగా ఫైట్‌కు రంగం సిద్ధమైంది. 140 కోట్ల మంది అంచనాలను మోస్తున్న రోహిత్ శర్మ బలగం.. ఐదుసార్లు జగజ్జేత ఆస్ట్రేలియాతో ఆదివారం అమీతుమీ తేల్చుకోనుంది. మరింకెందుకు ఆలస్యం మీరు కూడా టీవీలు ట్యూన్ చేసేయండి!

చెన్నై: వన్డే ప్రపంచకప్ వేట ప్రారంభించేందుకు టీమ్ ఇండియా రెడీ అయింది. ఇటీవల ఆసియా కప్ చేజిక్కించుకున్న భారత్.. అదే జోరుతో వరల్డ్‌కప్‌లోనూ శుభారంభం చేసేందుకు సమాయత్తమైంది. ఆదివారం చెన్నైలోని చెపాక్ స్టేడియంలో ఆస్ట్రేలియాతో భారత్ తలపడనుంది. పుష్కర కాలం తర్వాత భారత్‌లో జరుగుతున్న మెగాటోర్నీ కోసం రోహిత్ సేన అస్త్రశస్త్రాలు సిద్ధం చేసుకుంటే.. వరల్డ్‌కప్ అనే మాట వింటే చాలు పూనకం వచ్చినట్లు రెచ్చిపోయే కంగారూలు సమరానికి సై అంటున్నారు. రౌండ్ రాబిన్ లీగ్ పద్ధతిలో జరుగుతున్న ప్రపంచకప్‌లో ప్రతీ పోరు ప్రధానమైనదే కావడంతో ఈ మ్యాచ్ ఫలితంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఇటీవల స్వదేశంలో జరిగిన వన్డే సిరీస్‌లో కంగారూలపై టీమ్‌ఇండియా విజయం సాధించడం.. రోహిత్‌సేన మనోబలాన్ని పెంచే అంశం కాగా.. దానికి బదులు తీర్చుకోవాలని ఆసీస్ కృతనిశ్చయంతో ఉంది. విశ్లేషకులు ఈ మ్యాచ్‌ను భారత్ బ్యాటింగ్ బలానికి ఆసీస్ పేస్ దళానికి మధ్య సమరంగా అభివర్ణిస్తుండటంతో.. మన బ్యాటర్లపై భారీ అంచనాలు నెలకొన్నాయి. డెంగ్యూ బారిన పడిన యువ ఓపెనర్ శుభ్‌మన్ గిల్ త్వరగా కోలుకోవాలని ఆశిస్తున్నట్లు రోహిత్ వెల్లడించడాన్ని బట్టి చూస్తే.. అతడు ఆదివారం పోరుకు అందుబాటులో ఉండటం అనుమానమే! ఇదే నిజమైతే, హిట్‌మ్యాన్‌తో కలిసి ఇషాన్ కిషన్ ఇన్నింగ్స్ ఆరంభించనున్నాడు. ఆ తర్వాత విరాట్ కోహ్లీ, శ్రేయస్ అయ్యర్, కేఎల్ రాహుల్, హార్దిక్ పాండ్యా బ్యాటింగ్‌కు రానున్నారు. జస్ప్రీత్ బుమ్రా, మహమ్మద్ సిరాజ్ పేస్ భారం మోయనున్నారు. ఫుల్ ఫామ్‌లో ఉన్న మహమ్మద్ షమీకి నిరీక్షణ తప్పకపోవచ్చు. మరోవైపు అటు బౌలింగ్‌లో, ఇటు బ్యాటింగ్‌లో ఆస్ట్రేలియా సమతూకంగా కనిపిస్తున్నది. వార్నర్, మార్ష్, స్మిత్, లబుషేన్, గ్రీన్, కారీ, మ్యాక్స్‌వెల్‌తో ఆ జట్టు బ్యాటింగ్ శత్రుదుర్భేద్యంగా కనిపిస్తున్నది.

కమిన్స్

నిరీక్షణకు తెరదించేందుకు..

దశాబ్ద కాలంగా ఒక్క ఐసీసీ టోర్నీ కూడా గెలువని భారత జట్టు.. ఈ సారి ఆ కరువు తీర్చుకోవాలని తహతహలాడుతున్నది. 2011లో స్వదేశంలో జరిగిన వన్డే ప్రపంచకప్‌లో విశ్వవిజేతగా నిలిచిన భారత్.. సేమ్ సీన్ రిపీట్ చేయాలనుకుంటున్నది. అప్పటి జట్టు నుంచి కోహ్లీ, అశ్విన్ మాత్రమే ప్రస్తుత టీమ్‌లో చోటు దక్కించుకోగా.. మిగిలిన వాళ్లంతా ప్రపంచ చాంపియన్ బిరుదు కోసం పరితపిస్తున్నారు. లీగ్ దశలో తొమ్మిది మ్యాచ్‌లను తొమ్మిది వేర్వేరు వేదికలపై ఆడనున్న టీమ్‌ఇండియా.. చెన్నై నుంచి సమరశంఖం పూరించాలని మనమూ కోరుకుందాం! టీమిండియా ఆల్ ది బెస్ట్!!

6-6 2019 వన్డే ప్రపంచకప్ అనంతరం భారత్, ఆస్ట్రేలియా మధ్య 12 వన్డేలు జరగగా.. ఇరు జట్లు చేరో ఆరు విజయాలు నమోదు చేసుకున్నాయి.

భారత్: రోహిత్ (కెప్టెన్), గిల్/ఇషాన్, కోహ్లీ, శ్రేయస్, రాహుల్, పాండ్యా, జడేజా, అశ్విన్, కుల్దీప్, బుమ్రా, సిరాజ్.
ఆస్ట్రేలియా: కమిన్స్ (కెప్టెన్), వార్నర్, మార్ష్, స్మిత్, లబుషేన్, గ్రీన్, కారీ, మ్యాక్స్‌వెల్, స్టార్క్, హజిల్‌వుడ్, జాంపా.

తుది జట్లు (అంచనా)

ఇప్పటివరకు చెన్నైలో ఆడిన మూడు వరల్డ్‌కప్ మ్యాచ్‌ల్లోనూ ఆస్ట్రేలియా విజయం సాధించింది.

3

"ఏ ఆటగాడికైనా ప్రపంచకప్ అనేది అత్యంత ముఖ్యమైంది. అది సాధించకపోతే.. కెరీర్‌లో ఏదో అసంతృప్తి మిగిలే ఉంటుందని ఇప్పటికే ఎంతో మంది గొప్ప ప్లేయర్లు చెప్పారు. నేనూ అదే అంటున్నా. దీనికన్న పెద్దది ఇంకేముంటుంది.
-రోహిత్, భారత కెప్టెన్

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.